సాక్షి
కుమురం భీం

ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



సాయుధ బలగాల్లో సత్తా

కేంద్ర సాయుధ బలగాల్లో వివిధ కేటగిరీ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఉద్యోగాలు సాధించారు. 8లో▸



సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆసిఫాబాద్, సిర్పూర్(టి), రెబ్బెన మండలాలకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. వీటిని బాధితులకు శనివారం పంపిణీ చేశారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
26.0 /11.0

వాతావరణం

కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. గాలిలో తేమ పెరుగుతుంది. చలి అధికమవుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

విద్యార్థుల సంక్షేమంపై దృష్టి



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

వాంకిడి: విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన సందర్భంగా శనివారం మండలంలోని ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎనిమిది సంవత్సరాల తర్వాత 40శాతం డైట్ చార్జీలు, 200శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచిందని తెలిపారు. ప్రభుత్వం గురుకులాలు, వసతిగృహాలు, కేజీబీవీలు, అర్బన్ రెసిడెన్షియల్స్, ఆశ్రమ పాఠశాల్లో చదివే విద్యార్థులకు ఆరోగ్యకరమైన పోషక విలువలు కలిగిన మెనూ ప్రకటించిందని పేర్కొన్నారు. ప్రతీరోజు వివిధ రకాలైన ఆహారాన్ని అందించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జిల్లాలోని 110 విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

శైలజ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం



చెక్కు ఇస్తున్న రమాదేవి, విశ్వప్రసాద్, సక్కు

వాంకిడి: విద్యార్థిని శైలజ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ భరోసానిచ్చారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఇచ్చోడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శనివారం శైలజ కుటుంబానికి రూ.2లక్షల చెక్కు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు తక్షణ సాయం కింద రూ.లక్షా 20వేలు ఇచ్చినట్లు తెలిపారు. రెండు, మూడ్రోజుల్లో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు రూ.లక్ష ఇస్తారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడంతో పాటు శైలజ తమ్ముడి చదువును పూర్తిగా ప్రభుత్వమే చూసుకుంటుందని హామీ ఇచ్చారు. డీటీడీవో రమాదేవి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారాయణ, మాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, నాయకులు దీపక్ ముండె, మున్నీర్, సుమిత్ర జంగు తదితరులు పాల్గొన్నారు.

మంచుకురిసే వేళలో..

- మనసు దోచే అందాలు
- శీతాకాలంలోనూ మైమరిపించే అడవులు
- ఉమ్మడి జిల్లాలో ఎన్నో పర్యాటక ప్రాంతాలు

సండే స్పెషల్

తెలంగాణ కశ్మీరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా.. శీతాకాలంలో.. మంచు కురిసే వేళలో.. అనేక పర్యాటక ప్రాంతాలు ప్రకృతి ప్రేమికులకు మధురానుభూతి పంచుతున్నాయి. దీంతో పెద్ద ఎత్తున పర్యాటకులు, సందర్శకులు తరలివస్తున్నారు. సాధారణంగా చలికాలంలో సాయంత్రం అయితే ఇళ్లకే పరిమితమవుతారు. అయితే చలి కాలంలోనూ ప్రకృతి అందాలను ఆస్వాదించే పర్యాటకులు ఉంటారు. అందులోనూ అడవులు, కొండలు, జలపాతాలు, సెలయేళ్లు, పచ్చదనం పరుచుకున్న ఉమ్మడి జిల్లాలో చలి కాలంలోనూ ప్రకృతిని ఆస్వాదించవచ్చని పర్యాటక నిపుణులు చెబుతున్నారు. వానాకాలం, ఎండాకాలం కంటే మంచుకురిసే వేళలోనూ మనసు దోచే అందాలను తిలకించవచ్చని సూచిస్తున్నారు. ట్రెక్కింగ్, సైక్లింగ్, హైకింగ్, కాంపెయిన్లతో అడవుల్లో అటవీశాఖ పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. – సాక్షి ప్రతినిధి, మంచిర్యాల



కడెం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్

కవ్వాల్ కిటకిట

ఇప్పటికే అనేక మంది పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు కవ్వాల్ కేంద్రంగా ఉన్న టైగర్ రిజర్వుకు నిత్యం తరలివస్తున్నారు. ఇక చలి కాలంలోనూ పర్యాటకుల తాకిడి పెరిగింది. ఈ సమయంలోనే వన్యప్రాణులు, పక్షులు అధికంగా ప్రత్యక్షంగా కనిపించే అవకాశం ఉండడంతో అడవిని చుట్టేసేందుకు సఫారీని బుక్ చేసుకుంటున్నారు. పలు ప్రాంతాల నుంచి వలస వచ్చే పక్షులను నేరుగా తిలకించేందుకు బర్డ్‌వాక్ ఫెస్టివల్, నేచర్‌వాక్ పేరుతో ఇప్పటికే అటవీశాఖ పలు కార్యక్రమాలు చేపట్టింది. ఆదివారం కవ్వాల్‌లో బర్డ్‌వాక్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే వారాంతాల్లో ఉద్యోగులు, వ్యాపారులు, యువత, విద్యార్థులు అడవుల్లో గడిపేందుకు ఆసక్తి చూపుతున్నారు.

నదీ తీరాలు, సేద తీరేలా..



కడెం ప్రాజెక్ట్‌లో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

ఉమ్మడి జిల్లా చుట్టూ అనేక నదులు భౌగోళికంగా విస్తరించి ఉన్నాయి. గోదావరి, ప్రాణహిత, కడెం, పెన్‌గంగా, పెద్దవాగు వంటి నదీ తీరాలు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటాయి. ప్రకృతితో కలిసి మనస్సును మైమరిపంచే విధంగా తలపిస్తుంటాయి. ఆదిలాబాద్ నుంచి ఆసిఫాబాద్ వరకు అనేక కొండలు, గుట్టలు, చిన్నవాగులతో కలిసి ఉన్నాయి. కడెం పరిసరాలు, జైపూర్ మండలంలో ప్రాణహిత, శివ్వారంలో మొసళ్ల అభయారణ్యాలు, ఎల్ మడుగు, మహారాష్ట్ర సరిహద్దుగా ఉన్న గ్రామాలు ఉన్నాయి.

గిరిజన ఆవాసాలు

గిరిజన ఆచార వ్యవహారాలు, సంస్కృతి మైదాన ప్రాంతాలతో పోలిస్తే ప్రత్యేకంగా ఉంటుంది. ఈ క్రమంలో గిరిజన ప్రాంతాలను చుట్టేసి రావొచ్చు. వారి సంస్కృతి, సంప్రదాయాలు, అలవాట్లను గమనించవచ్చు. ఆసక్తి ఉంటే ఆ ప్రాంత గొప్పదనంపై అధ్యయనం చేయొచ్చు. గిరిజన ఆచార, వ్యవహారాలు, చలికాలంలో అమితమైన ఆహ్లాదాన్ని అందిస్తాయి.



తలమడుగు మండలం కోసాయి గ్రామం

ఆసక్తి పెరుగుతోంది



ప్రకృతి పరంగా ఈ సమయంలో గడపడం చాలా ఆనందంగా ఉంటుంది. ఇటీవల కాలంలో ప్రకృతిలో గడిపే వారి సంఖ్య పెరుగుతోంది. మనస్సుకు ఆహ్లాదం పంచే ప్రాంతాలను తరచూ సందర్శిస్తుంటాం.
– రవి సిరిపురం, పర్యాటకుడు, మంచిర్యాల



ఈప్రాంతాల్లో...

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలు శీతాకాలంలో కశ్మీర్ తరహాలో మంచుకురిసే స్థాయిలో వాతావరణం మారుతుంటుంది. తిర్యాణి, సిర్పూర్ యూ, కెరమెరి మండలాల్లో ఉష్ణోగ్రతలు అత్యల్పానికి చేరుతుంటాయి. ఇక్కడి ప్రాంతాలు కొండ కోనలు, అడవుల మధ్య మంచు కురుస్తూ అచ్చం కశ్మీర్‌ను తలపిస్తాయి. ఆధ్యాత్మికంగానూ జైనథ్ గుడి, బాసర, దండేపల్లిలో గూడెం సత్యనారాయణ స్వామి క్షేత్రం, గిరిజన ఆరాధ్య కేంద్రాలైన కేస్లాపూర్, కుమురం భీం పోరుగడ్డ జోడేఘాట్, మంచిర్యాల సమీపంలోని గాంధారి ఖిల్లా, ఏసీసీ క్వారీ, ఎల్లంపల్లి ప్రాజెక్టు వంటి తదితర ప్రాంతాలు సందర్శించవచ్చు.

అద్భుత ప్రాంతాలు ఉన్నాయి



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎన్నో అద్భుతమైన ప్రాంతాలు ఉన్నాయి. శీతాకాలంలోనూ పర్యటించే వారికి చక్కని అనుభూతి కలుగుతుంది. ఇప్పటికే మేం చాలా చోట్లకు వెళ్లాం.
– శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు, యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఇండియా

శీతాకాలపు వెన్నెల

శీతాకాలంలో పున్నమి వెన్నెల రాత్రి పూట కనువిందు చేస్తూ ఉంటుంది. ఈ వెన్నెలను పూర్తిస్థాయిలో ప్రకృతిలో గడిపేస్తూ ఆస్వాదించవచ్చు. ఇప్పటికే ప్రకృతి ప్రేమికులు నైట్ క్యాంపెయిన్ పేరుతో టెంట్లు వేసుకుని అడవులు, గిరిజన ఆవాసాల్లో గడిపేయడం మొదలైంది.



తక్కువ ఖర్చుతో అనుభూతి

ఉమ్మడి జిల్లాలోనే స్థానికులకు ఎన్నో అద్భుతమైన ప్రాంతాలు ఉన్నాయి. స్థానికంగానే అతి తక్కువ ఖర్చుతో అనేక ప్రాంతాలను కలియదిరిగి రావొచ్చు. చలికాలంలో అనారోగ్య ఇబ్బందులు లేని ఎవరైనా ఉమ్మడి జిల్లాలో అనేక చోట్లకు వెళ్లవచ్చు. చలికాలంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకుంటూ వారాంతాలు, సెలవు దినాల్లో ప్రకృతితో గడపాలని నిపుణులు సూచిస్తున్నారు.



పెరిగిన చలి తీవ్రత



సుంగాపూర్‌లో చలిమంట వద్ద గ్రామస్తులు

తిర్యాణి: జిల్లాలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం జిల్లాలోని సిర్పూర్(యు)లో 8.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, శనివారం ఏకంగా 6.7 డిగ్రీలు నమోదైంది. కెరమెరిలో 8.5, ధనోరాలో 9.4, ఆసిఫాబాద్‌లో 10.5, తిర్యాణిలో 10.7, లింగాపూర్‌లో 11.0, గిన్నెధరి, జైనూర్‌లో 11.2, చింతలమానెపల్లిలో 11.7, బెజ్జూర్‌లో 11.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

లోక్ అదాలత్‌తో సత్వరన్యాయం



సిర్పూర్(టి): కేసులు పరిష్కరిస్తున్న మెజిస్ట్రేట్

ఆసిఫాబాద్‌అర్బన్: లోక్ అదాలత్‌తో కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని జిల్లా జడ్జి ఎంవీ రమేశ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని న్యాయస్థాన భవన సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యువరాజు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. లోక్ అదాలత్ ద్వారా సివిల్, క్రిమినల్ కేసులతో పాటు ప్రీ లిటిగేషన్ కేసుల ను రాజీమార్గం ద్వారా పరిష్కరించనున్నట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ రకాల 3,288 కేసులు పరిష్కరించగా రూ.19.26 లక్షలను అపరాధ రుసుం రూపంలో వసూలు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో మూడు బెంచ్‌లు, సిర్పూర్‌లో ఒక బెంచ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లోక్‌అదాలత్ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులున్నారు.

రాజీమార్గమే రాజమార్గం

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ అజయ్ ఉల్లం మాట్లాడుతూ.. కక్షిదారులు రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే డబ్బు, సమయం ఆదా అవుతుందని తెలిపారు. అనంతరం జూనియర్ సివిల్ కోర్టు సిర్పూర్(టి) పరిధిలోని సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, దహెగాం, కాగజ్‌నగర్, కాగజ్‌నగర్ రూరల్, ఈస్గాం పోలీస్‌స్టేషన్లలోని కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించారు.

విద్యార్థుల సంక్షేమానికి కృషి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- కామన్ డైట్ ప్రారంభం



ఆసిఫాబాద్: విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్: విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురకుల పాఠశాలలో శనివారం ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న కామన్‌డైట్ కార్యక్రమాన్ని ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి ప్రారంభించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎనిమిదేళ్ల తర్వాత 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచిందని చెప్పారు. జిల్లాలోని 110 విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. వసతిగృహాల్లో పరిశుభ్రతపై సిబ్బందికి మూడు నెలల శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల ప్రపంచ చాంపియన్ షిప్ సాధించిన తెలుగు యువకుడు గూకేశ్, ఐఏఎస్ సాధించి మహారాష్ట్రలో సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న దుర్గం రేవయ్య గురుకులాల్లోనే చదువుకున్నారని, వీరిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి సజీవన్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ యాదగిరి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఏకలవ్య టీజీఈఎంఆర్ఎస్ పాఠశాలలో కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. అనంతరం తరగతి గదులు, వంటశాల, నిద్రించే గదులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు.

గన్నారంలో..

గన్నారంలోని ట్రైబల్ వెల్ఫేర్, ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలల్లో ఎమ్మెల్యే హరీశ్‌బాబు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ రమ్య, వేణి, సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేందర్ ఉన్నారు.

సిర్పూర్(టి)లో..

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో నూతనంగా ప్రవేశపెట్టిన కామన్ డైట్ మెనూను కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం ప్రారంభించారు. అనంతరం పాఠశాల, కళాశాల పరిసర ప్రాంతాలు, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎస్సై కమలాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే, మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఎంపీడీవో సత్యనారాయణ, ఆశ్రమ బాలికల పాఠశాలలో డిప్యూటీ తహసీల్దార్ బక్కయ్య, బీసీ బాలుర వసతి గృహంలో కౌటాల సీఐ ముత్యం రమేశ్ కామన్ డైట్ మెనూను ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హెచ్‌డబ్ల్యూవో సంజీవ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో..

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ వసతి గృహంలో కామన్ డైట్ మెనూను జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి రమాదేవి ప్రారంభించారు. విద్యార్థులకు అందుతున్న భోజనం, సదుపాయాలు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో భోజనం చేశారు. ఏసీఎంవో ఉద్ధవ్, డీఎస్‌వో మీనారెడ్డి, ఏటీడీవోలు చిరంజీవి, కమ్మర్ హుస్సేన్, శ్రీనివాస్, జీసీడీవో శకుంతల పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల (గురుకులం)లో ప్రభుత్వం ప్రకటించిన నూతన డైట్ మెనూను అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావ్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ శారద, సిబ్బంది పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ రూరల్: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

గ్రూప్‌-2కు సర్వం సిద్ధం

- నేటి నుంచి 18 కేంద్రాల్లో పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లాలో 4,389 మంది అభ్యర్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో గ్రూప్‌-2 పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఇప్పటికే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేయగా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అధికారులుతో పలుసార్లు సమీక్షా సమావేశాలు, పరీక్షా కేంద్రాల విజిట్ నిర్వహించారు. 15, 16 తేదీల్లో జిల్లాలోని 18 పరీక్షాకేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనుండగా 4,389 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు అధికారులు తెలిపారు.

పరీక్ష వేళలివే..

గ్రూప్‌-2 పరీక్ష ఈ నెల 15, 16 తేదీల్లో రెండురోజుల పాటు రెండు సెషన్లలో నిర్వహించనున్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం పరీక్షకు 8.30 నుంచి 9.30 గంటల వరకు, మధ్యాహ్నం పరీక్షకు 1.30 నుంచి 2.30 గంటల వరకే కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తారు. ఎస్కార్ట్ లేకుండా కేంద్రాలకు ప్రశ్నపత్రాలు తీసుకువస్తే తీసుకోవద్దని ఇప్పటికే చీఫ్ సూపరింటెండెంట్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి.

జిల్లాలో 18 పరీక్షాకేంద్రాలు

గ్రూప్‌-2 పరీక్షకు 4,389 మంది అభ్యర్థులు హాజరు కానుండగా జిల్లాలో 18 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో-9, కాగజ్‌నగర్‌లో-9 కేంద్రాలు ఏర్పాటు చేసి పరీక్ష నిర్వహణకు 228 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ప్రతీ సెంటర్‌కు ఇద్దరు బయోమెట్రిక్ సిబ్బంది, 10 మంది పోలీస్ సిబ్బందిని నియామకం చేశారు. జిల్లాలో నాలుగు రూట్‌లకు గాను ఎనిమిది మంది ఫ్లయింగ్‌స్క్వాడ్, 19 మంది సీఎస్‌లు, 38 మంది హెల్త్ సిబ్బందిని నియమించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎస్పీ, ఏఎస్పీలు పరీక్షాకేంద్రాలను విజిట్ చేయనున్నారు. పరీక్షాకేంద్రాల వద్ద ఎలాంటి అవకతవకలు జరగకుండా పోలీస్‌శాఖ అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. ప్రతీ పరీక్షాకేంద్రంలో మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.



పరీక్షాకేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ శ్రీనివాసరావు

పరీక్షా కేంద్రాలివే..

ఆసిఫాబాద్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, గిరిజన బాలికల గురుకుల పాఠశాల, బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మాతాశ్రీ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల (జన్కాపూర్), సెయింట్ మేరీ ప్రైవేట్ ఉన్నత పాఠశాల (జన్కాపూర్), తెలంగాణ మోడల్ స్కూల్ (హైవే రోడ్డు)లో పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారిస్ట్ ప్రైవేట్ స్కూల్ సెంటర్ (ఏ), సెయింట్ క్లారిస్ట్ ప్రైవేట్ స్కూల్ సెంటర్ (బీ), వివేకానంద డిగ్రీ కళాశాల, జవహర్ నవోదయ విద్యాలయం, సుప్రభాత్ ప్రైవేట్ ఉన్నత పాఠశాల, వివేకానంద జూనియర్ కళాశాల, వసుంధర్ జూనియర్ కళాశాల, ఫాతిమా కాన్వెంట్ స్కూల్ (ఏ), ఫాతిమా కాన్వెంట్ స్కూల్ (బీ)లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసిన అధికారులు ఇందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు.

సెంటర్ల వద్ద బందోబస్తు..

జిల్లాలో నిర్వహించే గ్రూప్‌-2 పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో ఇందుకు సంబంధించి పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పలు పరీక్షాకేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్ష రాసే అభ్యర్థులు తప్పకుండా గుర్తింపు కార్డు, హాల్‌టికెట్‌తో రావాలని సూచించారు. పరీక్షాకేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. పరీక్షాకేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని సూచించారు. పరీక్షాకేంద్రాలకు వెళ్లే దారిలో మార్గనిర్దేశం కోసం సూచన బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ పరీక్షాకేంద్రానికి 10 మంది పోలీస్ సిబ్బందిని కేటాయించినట్లు పేర్కొన్నారు.

కాగజ్‌నగర్ సెంటర్ పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారెట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్‌-2 పరీక్షాకేంద్రాన్ని శనివారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా, తహసీల్దార్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య తదితరులున్నారు.

అభ్యర్థులకు సూచనలు

- పరీక్ష రాసే అభ్యర్థులు తమ హాల్‌టికెట్‌పై తప్పకుండా లేటెస్ట్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో అతికించి తీసుకురావాలి.
- పరీక్షాకేంద్రానికి గంట ముందే చేరుకోవాలి.
- నలుపు లేదా నీలం బాల్‌పాయింట్ పెన్నుతోనే పరీక్ష రాయాలి.
- హాల్‌టికెట్‌తోపాటు ప్రభుత్వం జారీ చేసిన ఫొటో గుర్తింపుకార్డు తీసుకురావాలి.
- సెల్‌ఫోన్, చేతి గడియారం, క్యాలిక్యులేటర్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు.
- చెప్పులు మాత్రమే ధరించి రావాలి. ఆభరణాలు, మెహిందీ, టాటూలు వేసుకోరాదు.
- కొన్ని పరీక్షాకేంద్రాల్లో ఏ, బీ విభాగాలుగా రెండు కేంద్రాలుంటాయి. ఇది జాగ్రత్తగా చూసుకోవాలి.
- ఓఎంఆర్‌పై హాల్‌టికెట్ నంబర్ జాగ్రత్తగా తప్పు లేకుండా రాయాలి.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు మృతి

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గ్రామ స్టేజీ వద్ద శనివారం ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం..ఇటిక్యాల గ్రామానికి చెందిన చుంచు లింగయ్య(62) బైక్‌పై లక్సెట్టిపేటకు బయల్దేరాడు. మంచిర్యాల నుంచి లక్సెట్టిపేటకు వస్తున్న బస్సు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధాన్యం లారీ బోల్తా



ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్ గ్రామంలో శనివారం వరి ధాన్యంతో వెళ్తున్న లారీ బోల్తాపడింది. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం నుంచి లారీలో ధాన్యం తరలిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ధాన్యం బస్తాలు నేలమట్టమైనట్లు స్థానికులు పేర్కొన్నారు. ప్రమాద ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

'అల్లు' కేసు.. అంతా మనోళ్లే

నిర్మల్‌ఖిల్లా: సినీనటుడు అల్లు అర్జున్ అరెస్టు, బెయిల్ మంజూరు విడుదల పట్ల రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. పుష్ప–2 చిత్ర ప్రదర్శన సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో అభిమాని రేవతి మృతి చెందగా, ఈ కేసులో అర్జున్‌ను అరెస్టు చేశారు. ఈ కేసు పురోగతిలో హైదరాబాద్‌లోని చిక్కడపల్లి ఏసీపీగా పనిచేస్తున్న ఎల్.రమేశ్‌కుమార్, అల్లు అర్జున్ తరఫు న్యాయవాది నిరంజన్‌రెడ్డి, మధ్యంతర బెయిల్ ప్రకటించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జువ్వాడి జిల్లాకు చెందిన వారే కావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఏసీపీ రమేశ్ కుమార్ ఖానాపూర్ చెందిన వ్యక్తి, ప్రముఖ న్యాయవాది నిరంజన్‌రెడ్డిది దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జువ్వాడి శ్రీదేవిది నిర్మల్ జిల్లా కేంద్రం కావడం గమనార్హం.

కుక్కల దాడిలో 12 గొర్రెల మృతి

ముధోల్: మండలంలోని చింతకుంట తండాలో కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతిచెందాయి. రైతు రవీందర్‌కు చెందిన గొర్రెలను రోజు మాదిరిగా కొట్టంలో కట్టేశాడు. శుక్రవారం అర్ధరాత్రి కొట్టంలోకి ప్రవేశించిన కుక్కలు దాడి చేయడంతో గొర్రెలు మృతిచెందాయని స్థానికులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

సాయుధ బలగాల్లో మనోళ్లు



- ఉమ్మడి జిల్లాకు చెందిన యువకులు ఎంపిక
- అభినందించిన పలువురు

కేంద్ర సాయుధ బలగాల్లో వివిధ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్ష ఫలితాలు శుక్రవారం రాత్రి విడుదలయ్యాయి. వివిధ కేటగిరీల పోస్టులకు ఉమ్మడి జిల్లాకు చెందిన యువకులు ఎంపికయ్యారు. వారిని పలువురు అభినందించారు.

బీఎస్‌ఎఫ్ జవాన్‌గా సుప్రియ



సుప్రియ

భీమిని: తల్లి పడుతున్న కష్టాన్ని గుర్తించిన యువతి పట్టుదలతో చదివి ఉద్యోగాన్ని సాధించింది. కన్నెపల్లి మండలం రెబ్బెన పంచాయతీకి చెందిన పోతుగంటి సుప్రియ బీఎస్‌ఎఫ్ జవాన్‌గా ఎంపికైంది. మల్లేశ్–సునీత దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. గత పదేళ్ల క్రితం తండ్రి అనారోగ్యంతో మృతిచెందాడు. తల్లి..రెండెకరాల భూమిని కౌలుకు ఇచ్చి, వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ కష్టపడి చదివించింది. సుప్రియ లక్సెట్టిపేట ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ, పీజీ చదివి ఉద్యోగం కోసం శ్రమించింది. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో బీఎస్‌ఎఫ్ జవాన్‌గా ఎంపికైంది. కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సివిల్ ఎస్సై సాధించడమే తన లక్ష్యమని సుప్రియ తెలిపింది.

సీఆర్పీఎఫ్ జవాన్‌గా హరీశ్



జక్కుల హరీశ్

కుంటాల: కుంటాలకు చెందిన జక్కుల లక్ష్మి–శ్రీనివాస్ దంపతుల కుమారుడు హరీశ్ సీఆర్పీఎఫ్ జవాన్‌గా ఎంపికయ్యాడు. గత ఫిబ్రవరిలో ఎస్‌ఎస్‌జీడీ నిర్వహించిన అర్హత పరీక్షకు హాజరయ్యాడు. శనివారం మెరిట్ తుది జాబితా విడుదలైంది. ఇందులో హరీశ్ అర్హత సాధించి ఉద్యోగానికి ఎంపికకాగా, పలువురు అభినందించారు.

యూట్యూబ్ క్లాసులతో రెండు కొలువులు..



మహేశ్

సోన్: మండలానికి చెందిన కీ.శే రాజవ్వ–పోశెట్టి దంపతుల కుమారుడు మహేశ్ యూట్యూబ్ క్లాసులు విని రెండు ఉద్యోగాలు సాధించాడు. గతేడాది సీఆర్పీఎఫ్ రాత పరీక్ష రాశాడు. ఫలితం ఆలస్యంతో మళ్లీ ఎస్‌ఎస్సీజీడీ (బీఎస్‌ఎఫ్) 2024లో కానిస్టేబుల్ పరీక్ష రాశాడు. రెండు పరీక్షల ఫలితాలు విడుదల కాగా, రెండు ఉద్యోగాలు సాధించాడు.

సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా రాకేశ్



రాకేశ్

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన నీరటి రాకేశ్ సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగాన్ని సాధించాడు. ఈయన తండ్రి శంకర్ ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో పనిచేస్తున్నారు. పోలీసు ఉద్యోగం సాధించడం పట్ల మండల వాసులు అభినందనలు తెలిపారు.

అసోం రైఫిల్స్ కానిస్టేబుల్‌గా ఎంపిక



సాయిరామన్

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామానికి చెందిన యువకుడు కేంద్ర బలగాల్లో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. సరస్వతి–కమలాదర్ దంపతుల కుమారుడు సాయిరామన్.. పారా మిలిటరీ విభాగంలో అసోం రైఫిల్స్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించారు. గ్రామస్తులు అయనకు అభినందనలు తెలిపారు.

ఐటీబీపీ కానిస్టేబుల్‌గా అంజనీ తండావాసి



జాదవ్ సందీప్

నర్సాపూర్(జి): మండలంలోని అంజనీతండాకు చెందిన జాదవ్ సందీప్ సీఏపీఎఫ్‌లో ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. తండ్రి జాదవ్ రోహిదాస్ దిలావర్‌పూర్ పోలీసుస్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. తల్లి జానుబాయి గృహిణి. ఉద్యోగం సాధించడం పట్ల తండావాసులు అభినందించారు.

సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌గా కొండుకూర్ వాసి



శ్రీధర్

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామానికి చెందిన సంద శ్రీధర్ సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. సంద అమృత–గంగాధర్ దంపతుల కుమారుడు శ్రీధర్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించడం పట్ల కుటుంబీకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఓపెన్ స్కూల్ వరంలాంటిది

- జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు



అభ్యాసకులతో మాట్లాడుతున్న జేడీ

ఆదిలాబాద్‌టౌన్: వివిధ కారణాలతో చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ వరంలాంటిదని తెలంగాణ ఓపెన్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని మహాలక్ష్మివాడ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఓపెన్ స్కూల్ తరగతులను శనివారం ఆయన పరిశీలించారు. అభ్యాసకులతో మాట్లాడి తరగతుల నిర్వహణ, బోధన తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చదువు కొనసాగించడానికి, పదోన్నతులు ఇతర ఉన్నత చదువుల కోసం ఓపెన్ స్కూల్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకుని విద్యావంతులుగా ఎదుగాలని సూచించారు. ఆయన వెంట ఓపెన్‌స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.అశోక్, హెచ్‌ఎం పిల్లి కిషన్ తదితరులు ఉన్నారు.

సత్యదేవుణ్ని దర్శించుకున్న ట్రిబ్యునల్ చైర్మన్



దర్శించుకుంటున్న వెంకటేశ్వర్లు

దండేపల్లి: రెండో అన్నవరంగా ప్రసిద్ధిగాంచిన దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణ స్వామిని దేవాదాయశాఖ ట్రిబ్యునల్ చైర్మన్ వెంకటేశ్వర్లు శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అర్చకులు, అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సత్యదేవున్ని దర్శించుకున్న అనంతరం అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఈవో శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి లడ్డూ ప్రసాదాన్ని అందించారు. అర్చకులు రఘుస్వామి, వేదపండితులు భరత్‌శర్మ ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నస్పూర్: పట్టణ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మంచిర్యాల నుంచి చెన్నూర్ వైపు వెళ్తున్న ఆటోను సీసీసీ కార్నర్ వద్ద శనివారం తనిఖీ చేయగా రూ.18 వేల విలువ గల 6 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యంతోపాటు ఒకరిని సీసీసీ నస్పూర్ పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై లచ్చన్న, సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జూర్: మండలంలోని కుష్నపెల్లి సమీపంలోని వంతెన వద్ద రేషన్ బియ్యాన్ని బొలొరె వాహనంలో మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తుండగా శుక్రవారం రాత్రి ఎస్సై కె.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. మండలకేంద్రానికి చెందిన నౌషాద్ హుస్సేన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం అందడంతో పట్టుకున్నామని ఎస్సై తెలిపారు. 15 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వాహనం సీజ్ చేశామన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

తాంసి: భీంపూర్ మండలం గోముత్రి గ్రామానికి చెందిన గేడాం శంకర్ (37) అదృశ్యమయ్యాడు. ఎస్సై కలీం కథనం ప్రకారం.. శంకర్ ఈనెల 12న తన పెద్ద కుమారుడు రవీందర్‌తో కలిసి తమ చేనులో పురుగుల మందు పిచికారి చేశారు. మధ్యాహ్నం చేనులో భోజనం చేశారు. తర్వాత శంకర్ ఆరోగ్యం బాగా లేకపోవడంతో చెట్టు కింద ఉంటానని కుమారుడికి చెప్పి మిగతా పని చేయాలని సూచించాడు. పని అయిపోయిన తర్వాత చెట్టు కింద చూస్తే తండ్రి కనిపించలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. భార్య పుష్ప ఫిర్యాదుతో శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో అయ్యప్ప మాలధారుడి మృతి



సాయినాథ్ (ఫైల్)

కుభీర్: మండలంలోని పల్సి గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారుడు మోనోజీవార్ సాయినాథ్ (38) శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామంలోని అయ్యప్ప స్వామి సన్నిధానంలో పూజలు ముగించుకుని పంట పొలానికి వెళ్లాడు. కూలీతో కలిసి మొక్కజొన్నకు కాంప్లెక్స్ ఎరువు వేస్తున్నారు. ఈ క్రమంలో సాయినాథ్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. పక్కనున్న వ్యక్తి వెంటనే గమనించి హుటాహుటిన భైంసా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు పరిశీలించి సాయినాథ్ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

వృద్ధురాలిపై హత్యాయత్నం

మంచిర్యాలక్రైం: పేకాట ఆడవద్దన్నందుకు ఇద్దరు యువకులు వృద్ధురాలిపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. జిల్లా కేంద్రంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సీఐ ప్రమోద్‌రావు కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌లో ఉంటున్న జునగారి బాయమ్మ ఇంటి పరిసరాల్లో అదే ప్రాంతానికి చెందిన లారీడ్రైవర్ సయ్యద్ జుబేర్, మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుడు బూడిద దివాకర్ శుక్రవారం రాత్రి మద్యం సేవిస్తూ పేకాట ఆడుతున్నారు. బాయమ్మ వారి వద్దకు వెళ్లి ఇక్కడ పేకాట ఆడవద్దు అని కోరింది. వారు బాయమ్మను బూతులు తిట్టారు. ఇద్దరు కలిసి ఆమెను హత్య చేసేందుకు యత్నించగా గట్టిగా అరవడంతో వారు పరారయ్యారు. బాయమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో బైక్ దగ్ధం

ఆదిలాబాద్‌టౌన్: షార్ట్ సర్క్యూట్ కారణంగా రన్నింగ్ బైక్‌లో మంటలు చెలరేగి దగ్ధమైన ఘటన పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద శనివారం చోటుచేసుకుంది. రవీంద్రనగర్‌కు చెందిన చెందిన విజయ్ బైక్‌ను సర్వీసింగ్ చేయించుకుని ఇంటికి తిరిగి వెళ్తున్నాడు. ఎన్టీఆర్ చౌరస్తా వద్ద రాగానే బైక్ నుంచి మంటలు చెలరేగడం గమనించి పక్కకు ని లిపేశారు. అగ్నిమాపక శాఖ కార్యాలయం ఎదుట బైక్ దగ్ధం అవుతుండడంతో వెంటనే వారు స్పందించి మంటలార్పివేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

ఇంట్లో అగ్నిప్రమాదం..

తాంసి: మండలంలోని లీమ్‌గూడ గ్రామంలో మాజీ సర్పంచ్ తొడసం సంభు ఇంట్లో శనివారం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. ఫ్రిజ్‌తోపాటు వస్తువులు కాలిపోయాయి. స్థానికులు నీటితో మంటలార్పివేశారు. ప్రమాదంలో రూ.లక్షకు పైగా ఆస్తినష్టం వాటిల్లింది. మాజీ జెడ్పీటీసీ రాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల నగదు అందించారు. మాజీ సర్పంచులు సదానంద్, కృష్ణ, గజానన్ తదితరులు ఉన్నారు.

ఇల్లు దగ్ధం

బెజ్జూర్: మండలంలోని అందుగులగూడ గ్రామానికి చెందిన రైతు కోర్తె ప్రవీణ్ ఇల్లు శనివారం విద్యుత్ షాక్‌తో దగ్ధమైంది. 10 క్వింటాల్ పత్తితోపాటు ఇంటి సామగ్రి కాలిపోయాయి. సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. ఈ ప్రమాద ఘటనపై ఎస్సై ప్రవీణ్‌కుమార్ విచారణ చేపట్టారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న దాసరి ప్రసాద్



విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, నిమ్స్ మాజీ డైరెక్టర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ దాసరి ప్రసాద్ అన్నారు. వేదిక ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చెకుముఖి సైన్స్ సంబరాలను స్థానిక టీటీడీసీలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా స్థాయి చెకుముఖి సైన్స్ సంబరాల్లో ప్రతిభ కనబర్చిన సుమారు 300 మంది విద్యార్థులను ఈ ప్రదర్శనలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం వారు రూపొందించిన ఎగ్జిబిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, చీఫ్ సైంటిస్ట్ రాధ, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేశ్వర్, రాజు, బీఎస్ రెడ్డి, రవీందర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమాకాంత్, పెంటపర్తి ఉశన్న, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బినామీ పేర్లతో ఫైనాన్స్‌లో రుణాలు

- సుమారు రూ.6 కోట్లు కాజేసిన వైనం
- లబోదిబోమంటున్న బాధితులు

చెన్నూర్: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఓ ఫైనాన్స్ కంపెనీలో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేసిన వ్యక్తి బినామీ పేర్లతో ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి సుమారు రూ.6 కోట్లు కాజేసినట్లు తెలిసింది. బినామీ పేర్లతో డబ్బులు కాజేసిన సదరు వ్యక్తి చెన్నూర్ మండలంలోని కత్తరశాల గ్రామం. కత్తరశాల, కిష్టంపేట గ్రామాలకు చెందిన సుమారు 10 నుంచి 15 మంది పేర్ల భవనాలు ఉన్నట్లుగా ఫేక్ ఫొటోలు, డాక్యుమెంట్లతో ఒక్కొక్కరి పేరున రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల రుణాలు తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల సదరు ఫైనాన్స్ కంపెనీ వ్యక్తులు కిష్టంపేటకు చెందిన వ్యక్తి ఇంటికి వచ్చి మీరు రూ.25 లక్షలు తీసుకున్నారు. ఈఎంఐ కట్టాలని అడిగినట్లు తెలిసింది. రుణం తీసుకుని సదరు వ్యక్తి ఆందోళనకు గురయ్యాడు. వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లు పరిశీలించగా తన పేరున రుణం తీసుకున్నట్లు ఉండడంతో ఆరా తీశారు. కత్తరశాల గ్రామానికి చెందిన వ్యక్తి ఫేక్ డాక్యుమెంట్‌తో రుణం తీసుకున్నట్లు గుర్తించారు. మా పేరు మీద రుణం తీసుకుని మమ్ముల్ని అప్పుల పాలు చేస్తావా అని నిలదీయడంతో సదరు డబ్బులు చెల్లిస్తానని చెప్పినట్లు సమాచారం.

పరారీలో సదరు వ్యక్తి!

ఫేక్ డాక్యుమెంట్లతో డబ్బులు కాజేసిన సదరు వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిసింది. బాధితులు బినామీ పేర్లతో రుణాలు కాజేసిన వ్యక్తి ఇంటి చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలిసింది.

డాక్యుమెంట్లు ఇవ్వొద్దు



రుణాలు ఇప్పిస్తామని చెప్పితే వ్యక్తిగత డాక్యుమెంట్లు ఎవరికి ఇవ్వొద్దు. అమాయకులను ఆసరాగా చేసుకుని కొందరు మోసాలు చేస్తున్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. ఫేక్ డాక్యుమెంట్లతో రుణాలు కాజేసిన ఘటనపై ఇప్పటికి ఫిర్యాదు రాలేదు. ఫిర్యాదు వస్తే విచారణ చేపడుతాం.

– రవీందర్ సీఐ చెన్నూర్

శెభాష్..అభిమన్యు వాట్సప్ గ్రూప్

- చిన్నారి పాల కోసం రూ.30 వేల నగదు అందజేత
- ఆవుదూడ ఇచ్చిన లక్ష్మిటెంట్ హౌజ్ యజమాని సుభాష్



గంగారామ్‌కు ఆవుదూడ, నగదు అందిస్తున్న సభ్యులు తదితరులు

ఇచ్చోడ: నెల రోజుల చిన్నారి పాల కోసం అభిమన్యు వాట్సాప్ గ్రూప్ సభ్యులు రూ.30 వేల నగదు అందించి తమ ఉదారత చాటుకున్నారు. ఇచ్చోడ మండలం గుబ్బ గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ కనక జంగుబాయి(32) గత నెల పదిహేను రోజుల క్రితం రెండోకాన్పులో ఆడపిల్లకు జన్మనిచ్చింది. అనారోగ్యంతో ఆమె మృతిచెందింది. వ్యవసాయ కూలీ అయిన భర్త కనక గంగారామ్ నెలరోజుల బిడ్డకు పాలు ఇవ్వడానికి నానా కష్టాలు పడుతున్నాడు. అదే గ్రామానికి చెందిన యువకుడు గమనించి ఆదివాసీ యువకులు ఏర్పాటు చేసుకున్న అభిమాన్యు వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. దాదాపు 1,050 మంది ఉన్న గ్రూప్ సభ్యులు స్పందించారు. ఫోన్ పే, గూగుల్ పే ద్వారా రూ.30 వేల నగదు సేకరించారు. మండల కేంద్రంలోని లక్ష్మిటెంట్ హౌజ్ యజమాని పాన్‌పట్టె సుభాష్, ఆవు దూడ ఇవ్వడానికి ముందుకొచ్చాడు. గంగారామ్‌కు శనివారం ఆవుదూడతోపాటు రూ.30 వేల నగదు అందించారు. గ్రామస్తులు వారిని అభినందించారు. శేఖర్ బాబు, పెందూర్ దీపక్, లింగు, నాగోరావు, నగేశ్, దేవురావు, చాయ, శ్రీదేవి, లక్ష్మి, తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు కొడప నగేశ్ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న బెల్లంపల్లి రూరల్ సీఐ

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ప్రాంతంలో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. బెల్లంపల్లి టూటౌన్ పోలీసుస్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రం అమర్‌నగర్‌కు చెందిన ఎండీ జావిద్, అంబేద్కర్‌నగర్ వాసి ఎండీ సల్మాన్‌లు గంజాయి తరలిస్తున్నట్లు తమకు సమాచారం అందింది. వెంటనే టూటౌన్ ఎస్సై మహేందర్ అక్కడికి వెళ్లి చాకచక్యంగా నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 80 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ తెలిపారు.

లక్ష్యంతో చదివి ఉన్నతంగా ఎదగాలి



మాట్లాడుతున్న కుమ్ర ఈశ్వరిబాయి

ఇంద్రవెల్లి: వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నతంగా ఎదగాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి అన్నారు. మండలంలోని ముత్నూర్‌లోని తెలంగాణ గిరిజన బాలికల సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాల/కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి నూతన డైట్ జాబితాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తుందని తెలిపారు. సీడీపీవో ఉమాదేవి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

నీలుగాయిని వేటాడిన నేరస్తులకు జైలు



నిర్మల్ సబ్‌జైలు వద్ద నిందితులతో అధికారులు

కడెం: నీలుగాయిని వేటాడి హతమార్చిన ముగ్గురు నేరస్తులకు 14 రోజుల జైలు శిక్ష విధిస్తూ ఖానాపూర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జితిన్‌కుమార్ తీర్పునిచ్చారు. ఉడుంపూర్ రేంజ్ అధికారి అనిత కథనం ప్రకారం..మండలంలోని కల్లెడ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఈనెల 12న విద్యుత్ తీగలు అమర్చి నీలుగాయిని హతమార్చిన రాయఅంకులు, మేకరెడ్డి, సీపెల్లి భీమన్నపై కేసులు నమోదయ్యాయి. వీరిని కోర్టులో హాజరుపర్చి నేరం రుజువుచేయగా మెజిస్ట్రేట్ ఈ మేరకు తీర్పునిచ్చారు. నేరస్తులను నిర్మల్ సబ్ జైలుకు తరలించారు. అటవీ అధికారులు శనివారం నీలుగాయి కళేబరాన్ని అటవీ ప్రాంతంలో ఖననం చేశారు. ఇందులో డీఆర్వో డి.ప్రకాశ్, పశువైద్యాధికారి సౌందర్య, ఎఫ్‌బీవో సరిత, ఈజీఎస్ ఎఫ్ఏ రవీందర్ తదితరులు ఉన్నారు.